క్లుప్తంగా

గ్రీవెన్స్ సెల్‌కు నాలుగు అర్జీలు

మద్దిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు నాలుగు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ఆదిలక్ష్మి తెలిపారు. అర్జీలను వారం రోజుల్లోపు పరిష్కరించడానికి చర్యలు తీసుకోనున్నట్లు ఆమె వెల్లడించారు.

ఆక్రమణల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

చీమకుర్తి రూరల్: ఆక్రమణల చెర నుంచి ప్రభుత్వ భూమిని విడిపించాలని కోరుతూ సోమవారం ఒంగోలులో నిర్వహించిన కలెక్టర్ మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబుకు ఇలపావులూరు గ్రామస్తులు మనుబ్రోలు ఉమమహేశ్వరరావు, పులి నాగరాజు అర్జీ ఇచ్చారు. చీమకుర్తి మండలం ఇలపావులూరు గ్రామ పరిధిలోని రంగసాయిపురం సర్వే నంబర్ 86/2ఏ 18 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. దానిలో 9 ఎకరాలను గతంలో ఒంగోలుకు చెందిన వారు ఆక్రమించుకున్నారు. ప్రస్తుతం 8 ఎకరాల అసైన్డ్ భూమిని గ్రామంలోని కొంత మంది ఆక్రమించి చదును చేశారు. ఆక్రమణకు గురైన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజలకు, ప్రభుత్వానికి ఉపయోగపడేలా చూడాలని కోరుతూ అర్జీ అందజేశారు.

అందరికీ ప్రయోజనకరంగా పన్నుల విధానం



నాగులుప్పలపాడులో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

నాగులుప్పలపాడు: విదేశీ వద్దు- స్వదేశీ ముద్దు అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం దేశంలో అమలవుతున్న పన్నుల విధానాన్ని సరళీకృతం చేసి అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా చేసిందని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ అన్నారు. జీఎస్టీ 2.0పై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా సోమవారం నాగులుప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు మోటార్ సైకిళ్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ తలపాల ఏడుకొండలు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏవో దక్షిణామూర్తి, ఎంఈవోలు రవి, రమణయ్య, ఏపీవో రవిబాబు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ వైవీతో కైపు భేటీ

తాళ్లూరు: రాజ్యసభ వైవీ సుబ్బారెడ్డిని వైఎస్సార్ సీపీ మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు కైపు అశోక్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని పలు అంశాలను వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దర్శి: ఆటోనగర్ ప్రాంతంలో 11 కేవీ ఫీడర్ లైన్ పక్కకు మారుస్తున్నందున మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దర్శి ఆటోనగర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ సచ్చన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లైన్ పరిధిలో ఉండే అద్దంకి రోడ్డు, ఆటోనగర్, గంగవరం రోడ్డు, సందువారిపాలెం, చింతలపాలెం ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

టపాసుల విక్రయానికి అనుమతి తప్పనిసరి

పుల్లలచెరువు: దీపావళి పండగను పురస్కరించుకుని గ్రామాల్లో టపాసుల విక్రయానికి అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని ఎస్‌ఐ సంపత్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా దీపావళి మందులు అమ్మరాదని, దీపావళి పండగ సందర్భంగా ముందుగా నిల్వ చేయడం, షాపుల్లోనే ఉంచి అమ్మకాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అనుమతి పొందిన వారు మాత్రమే అమ్మకాలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

పెద్దదోర్నాల: గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ మస్తాన్‌నాయక్ పేర్కొన్నారు. పాఠశాలలో చేరనున్న నూతన ఉపాధ్యాయులకు సోమవారం ఆయన నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగం వృత్తి కాదని, నవ సమాజాన్ని తయారు చేసే బాధ్యతన్నారు. నూతనంగా బాధ్యతలు తీసుకుంటున్న ఉపాధ్యాయులు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో మొద్దు నాగేశ్వరరావు, మందగిరి వర్ధన్, రామకృష్ణ నాయక్ పాల్గొన్నారు.



చీమకుర్తిలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున



ఎక్సైజ్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వస్తున్న మేరుగు నాగార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



చీమకుర్తి ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కల్తీ మద్యంపై చర్యలేవి.?

- తంబళ్లపల్లి నుంచి అమలాపురం, ఇబ్రహీంపట్నం వరకు కుటీర పరిశ్రమల మాదిరిగా కల్తీ మద్యం తయారీ
- సిట్ పేరుతో కల్తీ మద్యం కేసును నీరుగారుస్తున్న కూటమి ప్రభుత్వం
- నాలుగు ఇళ్లకు ఒక బెల్ట్ షాపుతో మద్యాన్ని డోర్ డెలివరీ చేస్తున్నారు
- ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు
- కల్తీ మద్యంపై సీబీఐ విచారణ చేపట్టి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున డిమాండ్
- చీమకుర్తి ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన

చీమకుర్తి: తంబళ్లపల్లి నుంచి అమలాపురం, ఇబ్రహీంపట్నం వరకు కుటీర పరిశ్రమల మాదిరిగా టీడీపీ నాయకులు కల్తీ మద్యాన్ని తయారు చేస్తుంటే.. వారిపై నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఏంటని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున కూటమి ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ ఆధ్వర్యంలో కల్తీ మద్యంపై సోమవారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. సంతనూతలపాడు నియోజకవర్గానికి సంబంధించి చీమకుర్తిలోని ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ వద్ద మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేరుగు నాగార్జున మాట్లాడుతూ కల్తీ మద్యాన్ని ప్రోత్సహిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ చేస్తున్న పోరాటాల నేపథ్యంలో కేవలం సిట్ వేసి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. కల్తీ మద్యానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని నిగ్గుతేల్చేందుకు ప్రభుత్వంలోని అధికారులతోనే సిట్ వేస్తే ప్రభుత్వానికే అనుకూలంగా నివేదికలు వస్తాయి తప్ప కల్తీ మద్యం కేసులో నిజమైన దొంగలను పట్టుకునే పరిస్థితి ఉండదని మేరుగు నాగార్జున ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని ఎద్దేవా చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ మద్యం కేసులో నిజమైన దోషులను పట్టుకోవడానికి, అమాయక ప్రజల ప్రాణాలు కాపాడటానికి సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్ సీపీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు.

నాలుగిళ్లకు ఒక బెల్ట్ షాపేంటి.?

రాష్ట్రంలో నాలుగిళ్లకు ఒక బెల్ట్ షాపు పెట్టి ఇంటింటికి మద్యం బాటిళ్ల డోర్ డెలివరీ చేయడం ఏంటని మేరుగు నాగార్జున మండిపడ్డారు. కల్తీ మద్యం తయారు చేసే వారిపై ఇంతవరకు ఒక్క కేసు కూడా నమోదు చేయలేదని, కల్తీ మద్యానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్న ప్రభుత్వం.. దొంగపాలన సాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏరులై పారుతున్న కల్తీ మద్యం నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే స్పందించి తయారీదారులను అరెస్ట్ చేయాలని వైఎస్సార్ సీపీ డిమాండ్ చేస్తోందని మేరుగు నాగార్జున ప్రకటించారు. అనంతరం ఎక్సైజ్ సీఐని కలిసి కల్తీ మద్యానికి వ్యతిరేకంగా వినతిపత్రం అందించారు. తొలుత నియోజకవర్గంలోని నాగులుప్పలపాడు, మద్దిపాడు, సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు, స్థానిక ప్రజలతో చీమకుర్తి ఎస్ఎస్‌పీ కాలనీ నుంచి ఎక్సైజ్ స్టేషన్ వరకు ర్యాలీగా వచ్చారు. వినతిపత్రం అందించిన అనంతరం కార్యాలయం బయట మీడియాతో మేరుగు నాగార్జున మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు బొట్ల రామారావు, ఎంపీపీలు బీ విజయ, యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, దుంపా చెంచిరెడ్డి, వాకా కోటిరెడ్డి, కౌన్సిలర్లు పాటిబండ్ల గంగయ్య, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, బొడ్డు కోటేశ్వరరావు, ఎస్.రామచంద్రరావు, ఎస్.రమణమ్మ, పేరాల చెన్నకేశవులు, పాలపర్తి ప్రవీణ్, ఇమ్మిశెట్టి బాలకృష్ణ, డేనియేల్, సురేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఒంగోలులో ర్యాలీ నిర్వహిస్తున్న చుండూరి రవిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న చుండూరి రవిబాబు, నాయకులు

నారా బ్రాండ్ కల్తీ మద్యం.. ప్రజల ప్రాణాలతో చెలగాటం

- స్పిరిట్ పోసి రంగునీళ్లు కలిపి కల్తీ మద్యంతో ప్రాణాలు తీస్తున్నారు
- నకిలీ మద్యం తయారీని కుటీర పరిశ్రమగా మార్చడమే సీఎం చంద్రబాబు విజనా.?
- కూటమి పాలకుల కల్తీ మద్యం వ్యాపారం బయటపడకుండా ఉండేందుకే వైఎస్సార్ నాయకులపై లిక్కర్ కేసులు
- 10 రూపాయలకు దొరికే స్పిరిట్ బాటిళ్లను 110 రూపాయలకు బెల్ట్ షాపుల్లో విక్రయిస్తున్నారు
- కల్తీ మద్యంతో ప్రాణాలు తోడేస్తూ అధికారంలో కొనసాగడానికి సిగ్గులేదా.?
- పాలకుల చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు
- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు ధ్వజం

ఒంగోలు టౌన్: నారా బ్రాండ్ కల్తీ మద్యంతో కూటమి పాలకులు బడుగు బలహీన వర్గాల ప్రజల ప్రాణాలు హరిస్తున్నారని, కల్తీ మద్యం వ్యాపారాన్ని కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్ సీపీ హయాంలో లిక్కర్ స్కాం జరిగిందంటూ నాటకాలాడుతున్నారని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు విమర్శించారు. ఎన్టీఆర్ మద్య నిషేధాన్ని ఎత్తివేసిన చంద్రబాబుకు విచ్చలవిడిగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడమే కాకుండా బెల్టు షాపులు తెరిపించిన చరిత్ర వుందని గుర్తు చేశారు. నాణ్యమైన మద్యం పేరుతో 10 రూపాయల స్పిరిట్ బాటిళ్లకు రంగునీళ్లు కలిపి 110 రూపాయలకు విక్రయించి నూటికి 90 రూపాయల లాభాలు పంచుకుంటున్నారని ఆరోపించారు. కల్తీ మద్యాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు నగరంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ భవనం నుంచి ర్యాలీగా బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు.. కలెక్టరేట్‌లోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చుండూరి రవిబాబు మాట్లాడుతూ కూటమి పార్టీల నాయకుల చేత మద్యం టెండర్లు వేయించి వారి చేతనే బెల్టు షాపులు పెట్టించి కల్తీ మద్యాన్ని సరఫరా చేసి డబ్బులు దండుకుంటున్నారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో మంచినీరు దొరకని గ్రామాలు చాలా ఉన్నాయిగానీ.. మద్యం దొరకని గ్రామం ఒక్కటి కూడా లేదని ఎద్దేవా చేశారు. ఇదేనా చంద్రబాబు విజనరీ అని నిలదీశారు. ఆర్వో ప్లాంట్లు పెట్టినట్లు మద్యం తయారీ ప్లాంట్లు పెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందే జయచంద్రారెడ్డితో చేసుకున్న ఒప్పందంలో భాగంగానే టికెట్ కట్టబెట్టారని ఆరోపించారు.

పథకాలు అమలు చేయకుండా మోసం..

ఒకవైపు రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా మోసం చేస్తూ.. మరోవైపు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంటులను ఎగ్గొడుతున్న చంద్రబాబు ప్రభుత్వం పాలనాపరంగా పూర్తిగా విఫలమైందని చుండూరి రవిబాబు విమర్శించారు. సంక్షేమ పథకాలు అమలు చేయడం చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టుల మీద కేసులు పెడుతున్నారన్నారు. మద్యం స్కాం పేరుతో వైఎస్సార్ సీపీ నాయకుల మీద అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని, ఇవన్నీ ఊరికేపోవని హెచ్చరించారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు పోతుంటే ఏ ముఖం పెట్టుకుని అధికారంలో కొనసాగుతున్నారో చెప్పాలని చంద్రబాబును ప్రశ్నించారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా.? అని నిలదీశారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చారని, విమాన యాత్రలతో విహారయాత్రలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను చేస్తున్న తప్పులను ఎదుటివారి మీదకు నెట్టడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని, ఇప్పుడు కూడా దొడ్డిదారిని కల్తీ మద్యం వ్యాపారం చేస్తూ లిక్కర్ స్కాం అంటూ వైఎస్సార్ సీపీ మీద ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

వైఖరి మార్చుకోకపోతే ప్రజా కోర్టులో శిక్ష తప్పదు...

ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలో కల్తీ మద్యం వెలికితీసినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటి వరకు బెల్టు షాపులను ఎందుకు పరిశీలించలేదని చుండూరి రవిబాబు ప్రశ్నించారు. చంద్రబాబు వైఖరి మార్చుకోకపోతే ప్రజా కోర్టులో తగిన శిక్ష అనుభవిస్తారని హెచ్చరించారు. ప్రశ్నించడానికే పార్టీ పెట్టానని చెప్పుకుంటూ తిరిగే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎక్కడున్నారని అడిగారు. మూడు నెలలకోసారి ప్యాకేజీ తీసుకుంటే నిద్రపోతున్నారని ఎద్దేవా చేశారు.

వైఎస్సార్ సీపీ జిల్లా సెక్రటరీ సయ్యద్ అఫ్సర్ బేగం మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తీసుకొస్తే.. చంద్రబాబు 40 ఏళ్ల తన సర్వీసులో 14 లిక్కర్ కంపెనీలు తీసుకొచ్చాడని ధ్వజమెత్తారు. విడతలవారీగా మద్య నిషేధం వైపు జగనన్న నిర్ణయాలు తీసుకుంటే.. చంద్రబాబు రాష్ట్రాన్ని మద్యాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దాడని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం నాయకురాలు పేరం ప్రసన్న మాట్లాడుతూ కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు బలితీసుకుంటున్న చంద్రబాబు మహిళల ఉసురు పోసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్యాకేజీ స్టార్ పవన్‌కళ్యాణ్ నోరుతెరిచి మాట్లాడకపోవడం దుర్మార్గమన్నారు. కల్తీ మద్యాన్ని పూర్తిగా అరికట్టకపోతే మహిళలు ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తపట్నం ఎంపీపీ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణారెడ్డి, వై.వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, నగర అధ్యక్షుడు కఠారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, నగర పాలక సంస్థ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్ ఖాన్, కార్పొరేటర్ షేక్ రషీదా, ఆళ్ల రవీంద్రారెడ్డి, హౌసింగ్ బోర్డు చిన్నా, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, వడ్లమూడి వాణి, గోనెల మేరీకుమారి, బడుగు శోభాలత, మాధవి, బొప్పరాజు జ్యోతి, బెల్లంకొండ రమణమ్మ, సాదం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి కళలను ప్రోత్సహించాలి



కూచిపూడి విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: కూచిపూడి నాట్యాన్ని నేర్పుతూ చిన్నారులను తీర్చిదిద్దుతున్న నాట్య గురువు కె.లక్ష్మి సేవలు ప్రశంసనీయమని ఒంగోలు మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ సురేంద్ర అభినందించారు. ఎల్సీఈఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు చెన్నకేశవస్వామి దేవస్థానంలో విఘ్నేశ్వర కూచిపూడి నాట్యాలయం, ఒంగోలు వారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కూచిపూడి నాట్య సమ్మేళనంలో సురేంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా కవి పొన్నూరి వెంకట శ్రీనివాసులు, బీజేఎంసీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ షేక్ సిద్దంబి, ఎల్సీఈఎస్ నేషనల్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు కె.బుచ్చేశ్వరరావు, జిల్లా గ్రంథాలయం ఇన్చార్జ్ డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ కాళహస్తి జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఎంతోమందిని నాట్య గురువులుగా కూడా తయారు చేయడం గొప్ప విషయమని అన్నారు. అనంతరం కూచిపూడి నాట్యం ప్రదర్శించిన చిన్నారులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మద్దాలి మాధవరావు, డాక్టర్ గడ్డం కృష్ణయ్య, డాక్టర్ మధుర, డాక్టర్ కృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు



చాణక్య (ఫైల్)

కొమరోలు: మండలంలోని తాటిచెర్ల గ్రామంలో ఓ బాలుడు కనపడకుండా పోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు సోమవారం తెలిపారు. తాటిచెర్ల గ్రామానికి చెందిన నల్లబోతుల వెంకటస్వామి కుమారుడు చాణక్య(14) ఈనెల 7వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో వెంకటస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, బాలుడి ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషకం అందిస్తామని ఎస్సై పేర్కొన్నారు

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండించాలి



సభలో మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

సంతనూతలపాడు: మనువాదులు, మతోన్మాదుల ప్రమాదం నుంచి రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ మండలంలోని బీ మాచవరంలోని అంబేడ్కర్ భవన్లో సోమవారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ శూద్ర వర్ణంలో పుట్టిన వారు విద్య, ఉపాధి పరిపాలనలకు దూరంగా ఉండాలని, అంటరానివారుగా, ఊరికి దూరంగా జీవించాలని మనుధర్మశాస్త్రం చెబుతుందన్నారు. ఈ మనుధర్మ భావజాలం, సనాతన సంప్రదాయాలు సమాజాభివృద్ధికి ఆటంకమని, అమానవీయమైన కుల వివక్షతను అవి పెంచిపోషిస్తాయని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 1929లోనే మనుధర్మ శాస్త్రాన్ని నడివీధుల్లో దగ్ధం చేశారని గుర్తు చేశారు. ఆ మనుధర్మ భావజాలం వంటపట్టించుకున్న మతోన్మాదులు నేడు దేశంలో గద్దెనెక్కటం, వారి భావజాలం విస్తృతమవడం విచారకరమన్నారు. దాని ఫలితంగానే సమాజంలో ఇటువంటి పోకడలు విపరీతమవుతున్నాయన్నారు. జస్టిస్ బీఆర్ గవాయి ప్రధాన న్యాయమూర్తి కావడం మనవాదులకు ఏమాత్రం మింగుడు పడని అంశమని అన్నారు. మతోన్మాదుల చర్యలను ప్రజలంతా ముక్తకంఠంతో ప్రతిఘటించాలని, లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి అన్నవరపు శేషారావు, నాయకులు అడ్డగబొట్టు నరసయ్య, సుదర్శి నరసింహం, దాసరి సింగారావు, ప్రేమల సింగయ్య, దారా సుబ్బారావు, కోతి అంజయ్య, అన్నవరపు కోటేసు, కే అంకమ్మరావు, పి.వెంగయ్య, ఏ అంజిబాబు, నూతలపాటి శ్రీను, పులగర కోటేసు పాల్గొన్నారు.

నేటి నుంచి భాగవత ఉపన్యాసాలు

ఒంగోలు మెట్రో: ఒంగోలు దక్షిణం బజారు వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం ఏడు గంటలకు భాగవత కథా సుధాలహరి పేరిట ఆధ్యాత్మిక ఉపన్యాసాన్ని భాగవత ప్రచార సేవా సమితి అధ్యక్షుడు ఎంవీఎస్ శాస్త్రిచే నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రతి మంగళవారం సాయంత్రం ఏడు గంటలకు మహాకవి బమ్మెర పోతన విరచిత భాగవత కథలపై శాస్త్రి ప్రసంగం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలి

తాళ్లూరు: సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని దర్శి సీఐ వై.రామారావు సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. తొలుత రికార్డులు, స్టేషన్ పరిసరాలు పరిశీలించారు. రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాధితుల పట్ల గౌరవంగా మెలగాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐ రామారావు ఆదేశించారు. ఎస్సై ఎస్.మల్లికార్జునరావు, ఏఎస్ఐ భాస్కర్‌రావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయునికి సన్మానం

దొనకొండ: మండలంలోని పోలేపల్లి పంచాయతీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఐదేళ్లుగా ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించి ఇటీవల బదలీ అయిన బద్రి వెంకట రామాంజనేయులును సోమవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఆదిమూలపు ప్రభుదాసు మాట్లాడుతూ బద్రి వెంకట రామాంజనేయులుకు గ్రామంలో మంచి పేరు ఉందని, విద్యార్థుల తల్లిదండ్రుల పట్ల గౌరవంగా ఉండేవారని గుర్తు చేశారు. ఆయన పాఠశాలకు ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీవీ రామాంజనేయులు, పావని, సీఆర్‌పీ దేవమణి, పాఠశాల చైర్మన్ రమేష్ పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ మీ కోసంకు 71 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

ఒంగోలు టౌన్: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 71 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన బాధితులు వివిధ సమస్యలపై జిల్లా పోలీసు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణ కుమార్, తాలూకా సీఐ విజయకృష్ణ, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, దర్శి సీఐ రామారావు, కంభం సీఐ మల్లికార్జునరావు, సీసీఎస్ సీఐ జగదీష్ ఫిర్యాదులు స్వీకరించారు. బాధితుల సమస్యలడిగి తెలుసుకున్నారు. ఎక్కువగా భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఉద్యోగ మోసాలు, ఆర్థిక మోసాలు, చీటింగ్‌లకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. చట్టపరిధిలో విచారణ జరిపించి తగిన న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చారు. మీ కోసం ఎస్సై జనార్దన్‌రావు పాల్గొన్నారు.